క్లుప్తంగా

పాస్‌బుక్ ప్రింటర్ సేవలు ప్రారంభం



పాస్‌బుక్ ప్రింటర్ సేవలను ప్రారంభిస్తున్న జిల్లా బ్యాంకు మేనేజర్ వెంకటరమణ

గరుగుబిల్లి: మండలంలోని కొంకడవరం గ్రామంలో ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) ఆధ్వర్యంలో పాస్‌బుక్ ప్రింటర్ సేవలను సోమవారం ప్రారంభించారు. జిల్లా బ్యాంకు మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ బ్యాంకు సేవలను సులభతరం చేసేందుకు ఏపీజీవీబీ గ్రామాల్లో ఈ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇకనుంచి పాస్‌బుక్ ప్రింట్, అప్‌డేట్ కోసం బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్

పాలకొండ: మండలంలోని కొండాపురంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, సోమవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఏపీఓ ఈశ్వరమ్మ, సోషల్ ఆడిట్ రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు, డీఆర్‌పీ కృష్ణ ప్రసాద్ వేతనదారులతో మాట్లాడి, ఇంతవరకు చేపట్టిన పనులపై ఆరాతీశారు. దాదాపు రూ.28 లక్షల నిధులతో చేపట్టిన పనుల్లో 340 మందికి 100 రోజుల పాటు పని కల్పించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'




వినతులు స్వీకరించి, పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు పలు సమస్యల పరిష్కారంపై వినతిపత్రాలు సమర్పించారు. తమ సాగులో ఉన్న భూములను తమకు అప్పగించాలని పులిపుట్టి పంచాయతీలోని బిల్లుమడ గ్రామస్తులు, సీఆర్‌టీ పోస్టు ఇవ్వాలని గొట్టిపల్లికి చెందిన సంతోష్, రోడ్లు వేయాలని పొల్ల జమ్మడుగూడ గిరిజనులు, మినీ వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని సవర గోపాలపురం వాసి సునీత, స్ప్రేయర్లు ఇప్పించాలని పూనుపేట పున్నమ్మ, ఈఎంఆర్ఎస్‌లో ఆరో తరగతిలో సీటు ఇప్పించాలని కోసంగికి చెందిన ఝాన్సీ, కుట్టుమిషన్ ఇవ్వాలని కారెంకు చెందిన రంభ వినతిపత్రాల్లో కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏఎంఓ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

సీతంపేట: కనీస వేతనం అందివ్వాలని మధ్యాహ్న భోజనం వంట కార్మికులు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక ఎంఆర్‌సీ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. తమకు ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20కి పెంచాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అనంతరం ఎంఈఓ ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రోయిబారీ, ఉష, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చర్యలు



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: డ్రాపౌట్స్(బడి మధ్యలో మానేసిన పిల్లలు) లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి సూచించారు. సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆమె విద్యార్థులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లకూడదని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్యనందిస్తోందన్నారు. గతేడాది పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించామని తెలిపారు. తరచూ విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్లడం ద్వారా చదువుపై వారికి ఆసక్తి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. జగనన్న అమ్మఒడి పథకం నిధులను విద్యార్థుల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.

ఆహా ఏమి రుచి..!

జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మరింత పకడ్బందీగా నాణ్యతతో ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రోజువారీ ఇచ్చే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. రోజుకో మెనూతో రుచి, శుచితో కూడిన ఆహారం అందిస్తుండడంపై పిల్లలు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పకడ్బందీగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద
- గత ప్రభుత్వ హయాంలో అన్నం, సాంబారు మాత్రమే
- ప్రస్తుతం వారానికో మెనూ అమలు
- రుచి, శుచితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- రోజు తప్పించి, రోజు రాగిజావ పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు





జగనన్న గోరుముద్ద ఆరగిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) గుమ్మలక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

జగనన్న గోరుముద్ద రోజువారీ మెనూ..

వారం	ఆహార పదార్థం
సోమవారం	పులావు/హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
మంగళవారం	ఉదయం రాగిజావ, పులిహోర, పచ్చడి, గుడ్డు
బుధవారం	కూరగాయల అన్నం, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	ఉదయం రాగిజావ, సాంబారు, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
శనివారం	ఉదయం రాగిజావ, ఆకుకూర అన్నం, పప్పుచారు, పొంగల్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా నిరుపేదలే. వారికి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉండడంతో పాటు చదువులోనూ బాగా రాణిస్తారని బలంగా నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టారు. పౌష్టికాహార పదార్థాలతో కూడిన రుచి, శుచి కలిగిన మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు అందివ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. వారానికో మెనూ అమలు చేస్తూ అన్నంతో పాటు ప్రతిరోజూ చిక్కీ, ఉడికించిన గుడ్డు, రోజు తప్పించి రోజు రాగిజావ పంపిణీ చేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో అన్నం, సాంబారుతో వారంలో మూడుసార్లు మాత్రమే గుడ్డు ఇస్తుండేవారు. ప్రస్తుతం అన్నం, పప్పు, పులిహోర, కిచిడి, ఇలా రోజుకో రుచికరమైన ఆహారం అందిస్తూ పిల్లలతో ఆహా ఏమి రుచి అనిపిస్తోంది జగనన్న సర్కార్.

పర్యవేక్షణ పటిష్టం..

టీడీపీ హయాంలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఎటువంటి పర్యవేక్షణ ఉండేది కాదు. ప్రస్తుతం ఈ పథకం అమలుపై పర్యవేక్షణను రాష్ట్ర ప్రభుత్వం మరింత పటిష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా వారి విధుల్లో భాగంగా మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మధ్యాహ్న భోజనం నిర్వహణను తనిఖీ చేస్తున్నారు. వీరితో పాటు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పీఎంసీ కమిటీలు, గ్రామ/వార్డు సచివాలయ అధికారులకు సైతం ఈ పథకం అమలు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. దీంతో పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి మధ్యాహ్న భోజనం కింద నాణ్యమైన పౌష్టికాహారం అందుతోంది.

పెరిగిన ధరలకు అనుగుణంగా..

పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగానే మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఇదివరకు ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనానికి రూ.4.97 ఇస్తుండగా, తాజాగా రూ.5.45కు పెంచారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గతంలో రూ.7.45 ఉండగా, ఇటీవల దీనిని రూ.8.17కు పెంచారు. దీనిపై మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భోజనం బాగుంది..



మా పాఠశాలలో ప్రతిరోజూ మాకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతోంది. భోజనం చేసిన తర్వాత చిక్కీ కూడా ఇస్తున్నారు. గతంలో కన్నా ఇప్పుడు ఇస్తున్న ఆహారం చాలా బాగుంది. –బి.కీర్తిక, 8వ తరగతి, జెడ్పీ హైస్కూల్, గుమ్మలక్ష్మీపురం.

రోజుకో వంటకం..



మధ్యాహ్న భోజనం పథకం కింద రోజుకో వంటకం చేసి, అందజేస్తున్నారు. అన్నంతో పాటు మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం 9 గంటలకు రాగిజావ ఇస్తున్నారు. గతంలో ఒకేరకమైన అన్నం పెట్టేవారు. తినేందుకు అంతగా ఆసక్తి ఉండేది కాదు.

–టి.భానుమతి, 8వ తరగతి, జెడ్పీ హైస్కూల్, గుమ్మలక్ష్మీపురం

ప్రతిఇంటా 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని హుస్సేనుపురం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా ఆయన పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. టీడీపీ హయాంలో ఏదైనా పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే వచ్చేవన్నారు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్న సర్కారుపై టీడీపీ, ఎల్లో మీడియా లేనిపోని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తోందని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. నాడు–నేడు పథకం పేరిట పాఠశాలలు, ఆస్పత్రులను కూడా ఆధునీకరించారని, ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని, సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆ తర్వాత గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమై ఆమె పక్కాగా జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం అమలు చేసి, అర్హులకు పథకాలు, ప్రజలకు కావాల్సిన జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణపత్రాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జె.కన్నతల్లి, సర్పంచ్ టి.లక్ష్మి, ఎంపీటీసీ ఎస్.రాముడమ్మ, చిదిమి సర్పంచ్ డి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



మాట్లాడుతున్న మండల జేసీఎస్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్

భామిని: జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంను పక్కాగా అమలు చేయాలని మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంఎల్ఓ రాంప్రసాద్ సూచించారు. బాలేరు, భామిని, లివిరి సచివాలయాల పరిధిలో వేర్వేరుగా జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి, పథకాలు అందని వారు, జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లిన ఎంపీడీఓ జి.చంద్రరావు, తహసీల్దారు ఎస్.అప్పారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని జంపరకోట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. అర్హులందరికీ పథకాలు, సర్వీసు ఫీజు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువపత్రాలను అవసరమైన వారికి అందించేందుకు జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి సూచించారు.



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. అలాగే జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలు కూడా సేకరించారు.

అందుబాటులోకి అంబులెన్స్ సేవలు

సీతంపేట: ఏజెన్సీలోని కొన్ని ప్రాంతాల్లో అంబులెన్స్ సేవలు లేకపోవడంతో గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. ఇదే విషయమై అంబులెన్స్ డ్రైవర్లతో ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ విజయపార్వతి సోమవారం అత్యవసర సమావేశమై, తక్షణమే అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు బాధిత ప్రాంతాల్లో అంబులెన్స్ సేవలను పునరుద్ధరించారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని మంతినివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించి, అక్కడి రికార్డులు, కార్యకర్తల పనితీరును పరిశీలించారు. లబ్ధిదారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం అందివ్వాలని సిబ్బందికి సూచించారు.

నేడు సీఆర్‌టీల కౌన్సెలింగ్

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ స్కూల్ అసిస్టెంట్ల కౌన్సిలింగ్ మంగళవారం చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని, ఎస్జీటీల కౌన్సెలింగ్ బుధవారం జరుగుతుందని తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారని, మౌలిక సదుపాయాలు కల్పించారని, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అమలుచేసి, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు భవిష్యత్‌లో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, ఎంఈఓ ఆనందరావు, హెచ్‌ఎం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం మండల కేంద్రంలో జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు హాజరుకావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే విషయమై పాలకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పాలవలస రాజశేఖరం నివాసంలో సోమవారం మీడియాతో మాట్లాడిన వారు జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడత నిధుల పంపిణీ పురస్కరించుకుని, ఈ నెల 28వ తేదీన సీఎం కురుపాం విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ పేదవాడికి కార్పొరేట్ తరహా విద్యను ఆయన అందిస్తున్నారని, మనబడి నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద నిధులు విడుదల చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారన్నారు. అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఎంతోమంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసి, ప్రోత్సహిస్తున్నారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, జగనన్న అమ్మఒడి పథకం లబ్ధిదారులు సీఎం సభకు రావాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం మండల కేంద్రంలో ఈ నెల 28వ తేదీన జరిగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు హాజరుకావాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, జగనన్న అమ్మఒడి లబ్ధిదారులు హాజరై, ప్రజలకు మేలు చేస్తున్న సంక్షేమ సారథి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న పీఎంసీ చైర్మన్ జగదీష్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడం జరుగుతోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఎంసీ చైర్మన్ పైగా జగదీష్ కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా వారి నడవడికలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రభుత్వం మనబడి నాడు–నేడు పేరిట పాఠశాలల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్య, విద్యాసామగ్రి అందించడం వంటి చర్యలు చేపడుతోందని వివరించారు. విద్యార్థులు కూడా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పీఎంసీ సభ్యులంతా విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



రైతులకు కూరగాయల విత్తనాలు అందజేస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: పెరటితోటల పెంపకంలో భాగంగా మండలంలోని తాడికొండ రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు కూరగాయల విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది బీజామృతంతో విత్తనాల శుద్ధి, దాని ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, పొలాల్లో చల్లుకోవడం ద్వారా విత్తనాల మొలకశాతం పెరుగుతుందని, దీంతో పాటు తెగుళ్లు, చీడపీడల బారిన విత్తనాలు, పంట పడదన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎన్ఎఫ్ సీఆర్పీ ఎం.పరశురాం, వీఏఏ పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై శిక్షణ



జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ గ్రామంలో ఘన, ద్రవ జీవామృతం తయారీపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసుకుంటే ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అలాగే పంటలు చీడపీడలు, తెగుళ్ల బారినపడకుండా ఉంటాయన్నారు. ఏడాది పొడవునా రైతులు పంటలు పండించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాల వల్ల కలిగే ప్రయోజనాలు, పంటల వైవిధ్యం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జట్టు కో–డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, జీవా కో–ఆర్డినేటర్ జి.ప్రబోద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం



పాలకొండ రూరల్: మానవహారం చేపట్టిన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యం కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు ఎంతో మంది యువత బానిసలై, తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని వివరించారు. మరెంతోమంది ధూమ, మద్యపానం చేస్తూ ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్న లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఈబీ సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యానికి యువత, విద్యార్థులు బానిసలు కావొద్దని తెలిపారు. అనంతరం పట్టణ వీధుల్లో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ పేరిట విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.